క్లుప్తంగా

భక్తి భావంతోనే దేవుని ప్రేమ


దివ్యబలి పూజ సమర్పిస్తున్న ఖమ్మం బిషప్ సగిలి ప్రకాశ్

వైరా: దేవుని ప్రేమను ప్రతి ఒక్కరూ పొందాలంటే ఆయన పట్ల భక్తి భావం కలిగి ఉండాలని ఖమ్మం బిషప్ రెవరెండ్ ప్రకాశ్ సగిలి అన్నారు. ఆదివారం స్థానిక శాంతినగర్ హోలీ ట్రినిటీ చర్చిలో పాస్టల్ విజిట్‌లో భాగంగా చర్చిని సందర్శించి దివ్యబలి పూజ సమర్పించారు. ప్రభువే అందరికి కాపరి అని బైబిల్ బోధనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక క్రైస్తవ సంఘం పెద్దలు ప్రకాశ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ జ్యాన్నేసు, క్రీస్తు జ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ మర్పకట్ల శ్రీకాంత్, ఫాదర్ విజయ్, సిస్టర మీనా, సిస్టర్ యమున తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు..

ముదిగొండ: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సీఐ మురళి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలువురి యువకులు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టిసారించాలన్నారు. యువత మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఎస్సై హరిత, ఏఎస్సై శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుళ్లు మల్లయ్య, ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఏన్కూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది చదివిన 2004 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సదర్భంగా ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులైన సుజాత, నాగిరెడ్డి, నాగేశ్వరరావు, కృష్ణారావు, అబ్రహంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో షేక్ ఇబ్రహీం, పాశం నరేష్, పొట్ట నరేష్, సీతారాములు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


మాట్లాడుతున్న పాఠశాల హెచ్ఎం శాంతి

ముదిగొండ: ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని పాఠశాల హెచ్ఎం కె.శాంతి ఆదివారం ప్రారంభించారు. ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు ఆర్ట్, క్రాఫ్ట్, యోగా, స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ అందిస్తున్నారు. వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం కోరారు.

సమ్మెను జయప్రదం చేయండి


సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హమాలీలు

తల్లాడ: ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీరామ కోల్డ్ స్టోరేజ్ వద్ద హమాలీ కార్మికులతో కలిసి సమ్మె వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. అసంఘటితరంగంలో పనిచేస్తున్న కార్మికులకు పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్లను రెగ్యులైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మెను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు షేక్ లాల్‌మియా, భూక్యా బాలు, శ్రీను, కృష్ణ, నాగేశ్వరరావు, రాము, నాగుల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోక్షమెప్పుడో..?


జన్నారం - ఆరికాయలపాడు మధ్య ఉన్న గిన్నెల వాగు

- నిర్మాణానికి నోచుకోని గిన్నెలవాగు వంతెన
- ఇబ్బందులు పడుతున్న రైతులు, గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఏన్కూరు: గిన్నెల వాగుపై వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో రైతులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పొలాలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగిపోవాల్సి వస్తుంది. ఈ సమస్యను ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారానికి మాత్రం నోచుకోవడం లేదు. ఎన్నికలప్పుడు అన్ని పార్టీల వారు హామీలు ఇచ్చినప్పటికీ అధికారం చేపట్టిన తరువాత మాత్రం ఆ హామీ గుర్తుకెందుకు రావడం లేదో అంటూ పలుగ్రామాల ప్రజలు గుసగుసలాడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు..

గిన్నెలవాగుపై నుంచి నాలుగు మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని జన్నారం, ఆరికాయలపాడు గ్రామాల మధ్య రైతులు, గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు 3 కిలోమీటర్లు బీటీ రోడ్డు వేశారు. మధ్యలో ఉన్న గిన్నెలవాగుపై వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వాగుపై వంతెన నిర్మిస్తే.. ఏన్కూరు, రఘునాథపాలెం, కొణిజర్ల, మంచుకొండ మండలల్లోని ప్రజలకు రాకపోకల దూరం తగ్గుతుంది. ఈ దారి నుంచి ఏన్కూరు, జన్నారం, ఆరికాయలపాడు, గద్దలగూడెం, ఉప్పలచెలక, పంగిడి, యిర్లపూడి గ్రామాల ప్రజలకు నిత్యం రాకపోకలు కొనసాగుతాయి. రైతులు పండించిన పంటలు మార్కెట్‌కు తరలించేందుకు అణువుగా ఉంటుంది.

తగ్గనున్న దూరం..

ఈ దారి నుంచి ఖమ్మం, ఇల్లెందు వెళ్లే ప్రజలకు దూరం తగ్గుతుంది. పలు గ్రామాలను కలిపే ఈ రహదారిలో ఉన్న గిన్నెలవాగు నిర్మాణం చేపడితే నిత్యం రైతుల, ప్రజలు రాకపాకలు కొనసాగిస్తారు. జన్నారం రైతులకు ఆరికాయలపాడు, ఆరికాయలపాడు రైతులకు జన్నారంలో పొలాలు ఉన్నాయి. వర్షకాలంలో వాగు వచ్చినపుడు రైతులు గద్దలగూడెం మీదుగా అంజనపురం నుంచి జన్నారం రాకపోకలు కొనసాగించడం వలన నాలుగు కిలోమీటర్ల దూరం పెరుగుతుంది. ఏన్కూరు నుంచి జన్నారం మీదుగా ఆరికాయలపాడు వేళ్లడం వలన 5 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఇన్ని గ్రామాలను అనుసందానం చేసే ఈ రహదారిలో ఉన్న వాగుపై వంతెన నిర్మాణం పూర్తి చేయాలని నాలుగు మండలాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగుతాయి..



గిన్నెలవాగుపై వంతెన నిర్మాణం చేపట్టడం వలన ఏన్కూరు, ఆరికాయలపాడు, కొణిజర్ల, మంచుకొండ మండలాల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి. రైతులు తమ పంటలను ఈ దారిగుండా మార్కెట్‌కు తరలించవచ్చు. ఎమ్మెల్యే స్పందించి వంతెన నిర్మాణానికి కృషి చేయాలి.

– గుడ్ల వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్, ఆరికాయలపాడు

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు..



వర్షాకాలం వచ్చిందంటే గిన్నెలవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో జన్నారం వద్ద ఉన్న పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. పొలానికి ఎరువులు కొట్టాలన్న గద్దలగూడెం నుంచి తిరిగి వెళ్లాల్సివస్తుంది. పంటలు మార్కెట్‌కు తరలించాలన్న ఇబ్బంది అవుతుంది.

– భట్టు హనుమంతు రెడ్డి, రైతు, ఆరికాయలపాడు

చల్లగ చూడమ్మా.. పెద్దమ్మతల్లీ

ముగిసిన అమ్మవారి జాతర


పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: సుఖ, సంతోషాలతో.. పాడి పంటలతో చల్లగ ఉండేలా దీవించమ్మా.. పెద్దమ్మ తల్లీ అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని అయ్యగారిపేట నాయకపోడు గిరిజనుల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి గద్దె నెక్కడంతో ఆదివారం జాతర ముగిసింది. ఈ సందర్భంగా మైలపట్నం, జలాభిషేకం, నిప్పుల గుండం ప్రవేశంతో అమ్మవారిని దర్శించుకున్నారు, సాంప్రదాయంగా వీరతాడుతో గణాచారులు కొట్టడం వల్ల మంచి జరుగుతుందనే నమ్మకంతో చాలా మంది గిరిజనులు ఆసక్తి చూపించారు. బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పుచ్చా వెంకటేశ్వరరావు, కాశిని రాజులు, పుల్లయ్య, దుబ్బా శ్రీను, చింతల సురేష్, బేతి కృష్ణ, బూరుగు వెంకటేశ్వర్లుతో పాటు అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, పెనుబల్లి, సత్తుపల్లి ప్రాంత నాయకపోడు గిరిజనులు పాల్గొన్నారు.

బత్తులపల్లి గ్రామంలో..

కల్లూరురూరల్: మండలంలోని బత్తులపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రాఘురాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, కాంగ్రెస్ నాయకులు లక్కిరెడ్డి ఏసురెడ్డి, పిచ్చిరెడ్డి, బీరవెల్లి మాధవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటసాయినగర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ


శ్రీవెంకటసాయినగర్‌లో బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

కారేపల్లి: మండలంలోని శ్రీవెంకటసాయినగర్‌లో బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి, శ్రీఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నోముల ఆదినారాయణ, అక్కినపల్లి సంపత్ ఆచార్యులు, చింతోజు బ్రహ్మాచారి, వెంకటస్వామి, వారి శిష్య బృందంచే.. మంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠ మహోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా సాంస్కృతిక నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ తమ భక్తి పారవశ్యాన్ని ప్రదర్శించారు. అనంతరం మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. 12న గ్రామ దేవతలకు బోనాల సమర్పణ ఉంటుందని, వెంకటసాయి నగర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చాందావత్ లక్ష్మణ్, ఈసం భాస్కర్, కమిటీ సభ్యులు రాంబాబు, రామారావు, నాగేశ్వరరావు, దుర్గయ్య, సమ్మయ్యలు పేర్కొన్నారు.

గార్లఒడ్డులో ఘనంగా బ్రహ్మోత్సవాలు

ఏన్కూరు: మండలంలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రెండో రోజు స్వామివారి జయంతిని వైభంగా నిర్వహించారు. 108 కలశములతో అభిషేకాలు, ధ్వజారోహణం, తీర్థప్రసాద వితరణ, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, యాగశాల, ఆరాధానాలు, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి ఎస్‌వీడీ ప్రసాద్, మద్దిగుంట నర్సింహారావు, అర్చకులు బద్రి ఆచార్యులు వేణుగోపాలచార్యులు, నాగారాజు, కిరణ్‌కుమార్, నిఖిల్, కిషోర్‌కుమార్, నారాయణ పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

ముదిగొండ: ముదిగొండలోని వృద్ధగిరి కొండపై స్వయంభుగా వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం అత్యంత వైభవంగా ఆదివారం రాత్రి నిర్వహించారు. అర్చకులు రొంపిచర్ల చినసరసింహాచార్యుల ఆద్వర్యంలో శిష్య బృందంచే వివిధ అభిషేకములను నిర్వహించారు. కల్యాణ క్రతువును అర్చకులు వేద మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. సువర్ణాపురం, చిరుమర్రి, ముదిగొండ, వెంకటాపురం, న్యూలక్ష్మీపురం, తదితర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

‘టీజీ ఈఏపీ’లో రాణించిన విద్యార్థులు

మధిర టౌన్ టాపర్ జోష్వవ్..


రామిశెట్టి జోష్వవ్ కుమార్

మధిర: టీజీఈఏపీసెట్ ఫలితాల్లో మధిర పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన రామిశెట్టి జోష్వవ్ కుమార్ రాష్ట్రస్థాయిలో 334వ ర్యాంకుతో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. అదేవిధంగా అత్యుత్తమ మార్కులు సాధించి మధిర టౌన్ టాపర్‌గా నిలిచాడు. ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 992/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్ సాధించాడు. దీంతో జోష్వవ్‌ను పలువురు అభినందించారు.

మండల వాసికి రాష్ట్రస్థాయి ర్యాంకు..


అన్నాబత్తుల ఇందు


కొణిజర్ల: మండలంలోని లాలాపురం గ్రామానికి చెందిన అన్నాబత్తుల ఇందు టీజీఈఏపీసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 303వ ర్యాంకు సాధించింది. గ్రామానికి చెందిన రైతు అన్నాబత్తుల వెంకటరమణ, సరిత దంపతుల కూతురు ఇందు ఇంటర్ ఎర్రుపాలెంలోని మహాత్మా జ్యోతీబా పూలే బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో చదివింది. గ్రామస్తులు ఇందును అభినందించారు.

మండలంలో పొంగులేటి పర్యటన


నూతన జంటను ఆశీర్వదిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తల్లాడ: మండలంలో ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. మల్లవరం గ్రామంలో కుంచం సైదులు, ఉషశ్రీ, నారాయణపురంలో లావణ్య, అశోక్ వివాహ వేడుకకు హాజరై నూతన జంటలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, రాజశేఖర్, జైపాల్, నరసింహారావు, వెంకటనారాయణ, కోటారెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, వీరారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మాతృదినోత్సవం


ఏన్కూరులో మాతృదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏన్కూరు: మండల కేంద్రంలో బాలవారాహి భగవద్గీత సేవా వాహిని వారి ఆధ్వర్యంలో ఆదివారం మాతృదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవి ఆర్యవైశ్య కల్యాణమండపంలో నిర్వహించిన మాతృదినోత్సవంలో చిన్నారులు తమ మాతృమూర్తులకు పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో బాలవారాహి భగవద్గీత సేవా వాహిని సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ: మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించి, పలు కుటుంబాలను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పరామర్శించారు. పాత పినపాకలో ఎంపీ ల్యాండ్స్, సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న మూడు సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీ శంకుస్థాపన చేయగా.. ఆయనను గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అనంతరం మిట్టపల్లి గ్రామంలో గ్యాస్ సిలిండర్ ప్రమాదం బాధితుడు గుత్తికొండ వినోద్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని, ధైర్యంగా ఉండాలని, ఆర్థిక సాయం అందించారు. అనంతరం వివాహ వేడుకలకు హాజరై నూతన జంటలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దయానంద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ నీరజ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు..

పెనుబల్లి: మండలంలోని గుర్వాయిగూడెంలో ఆదివారం నిర్వహించిన రామాలయం మరియు బొడ్రాయి ప్రతిష్ఠా కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రాఘురాంరెడ్డి, మట్టా దయానంద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిచారు. వీరికి ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలవడమే కమ్యూనిజం

బోనకల్: సమస్యలపై పోరాడుతూ ప్రజల పక్షాన నిలవడమే కమ్యూనిజమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం మండలంలోని రాయన్నపేటలో నిర్వహించిన ఉద్యమ నాయకుడు, పేద ప్రజల ఆశాజ్యోతి తూము ప్రకాశరావు సతీమణి సుశీలమ్మ సంస్మరణ సభలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు హేమంత్‌రావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుదర్శన్‌రావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం లతో పాల్గొని మాట్లాడారు. ముందుగా సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుశీలమ్మ మృతి పార్టీకి తీరని లోటన్నారు. తూము ప్రకాశరావు పేరుమీద వారి కుటుంబ సభ్యులు బత్తినేని చారిటబుల్‌ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తోట రామాంజనేయులు, యంగల ఆనందరావు, ఆకెన పవన్, సీపీఎం నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, కిలారు సురేష్, టీడీపీ నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రతిభా విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను అభినందిస్తున్న సేవాసమితి సభ్యులు

మధిర: ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మధిర సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక అభిరామ్ టవర్స్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఇంటర్మీడియట్, 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఆలా ఆరోగ్య వరప్రసాద్‌రావు ఆర్థిక సహకారంతో మెమెంటోలు అందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మధిర సేవా సమితి అధ్యక్షుడు పల్లపోతు ప్రసాదరావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి, కోశాధికారి లింగంపల్లి అప్పారావు, సతీష్, రామకృష్ణ, చల్లా సత్యనారాయణ, జింకల కోటేశ్వరరావు, చలువాది కృష్ణమూర్తి, నకిరికంటి గోవింద్, బాహాటం శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ భూ నిర్వాసితులతో అధికారుల చర్చలు

కారేపల్లి: కామేపల్లి మండలం భాగ్యనగర్‌తండా సబ్‌స్టేషన్ భూ నిర్వాసితులతో విద్యుత్ అధికారులు ఆదివారం కొత్తలింగాల సబ్‌స్టేషన్‌లో చర్చలు జరిపారు. సబ్‌స్టేషన్‌కు స్థలం ఇచ్చిన నిర్వాసితులకు ఆపరేటర్ పోస్టు ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్‌కు విలువైన భూమిని ఇచ్చామని, తమకు పరిహారంతో పాటు ఉద్యోగం ఇస్తామని అప్పటి అధికారులు, ప్రజాప్రనిధులు హామీ ఇచ్చారని నిర్వాసితులు తెలిపారు. ఇప్పటివరకు పరిహారం కానీ ఉద్యోగం ఇవ్వకుండా తాత్సర్యం చేశారని వారి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖలో పర్మినెంట్ పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చల్లో విద్యుత్ డీఈ రామారావు, ఏడీఏ ఆనంద్, ఏఈలు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎస్సై సాయికుమార్, నిర్వాసితులు లకావత్ లక్ష్మి, వాంకుడోత్ కల్యాణ్, మాజీ జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్, మాజీ సర్పంచ్ బన్సీలాల్, మోహన్, యుగేందర్ పాల్గొన్నారు.


అధికారులతో చర్చిస్తున్న నిర్వాసితులు

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న శేఖర్‌గౌడ్

చింతకాని: రైతు సంక్షేమానికై ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని జగన్నాధపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ఈ సమావేశంలో మధిర ఆత్మ కమిటీ డైరెక్టర్లు కొప్పుల గోవిందరావు, సట్టు వెంకటేశ్వర్లు, తోటకూరి ప్రగతి, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

అందాల రంగుల గుల్‌మోహర్..


గండసిరి సమీపంలో రోడ్డు వెంట ఉన్న గుల్‌మోహర్ చెట్టు

ముదిగొండ: రోడ్ల వెంట నాటిన మొక్కలు.. అక్కడక్కడా ఉన్న గుల్‌మోహర్ అందాల రంగులతో ఎంతో చూడముచ్చటగా ఉన్నాయి. ప్రతి వేసవికాలంలో మేలో విరబూసే ఈ అందాల చెట్టు వైపు చూపరులను కట్టి పడేస్తుంది. ప్రకృతి రమణీయతను బట్టి ఉదయం చల్లగాలులకు పక్షులతో వికసించే విధంగా అందంగా ఈ చెట్ల రంగులతో ముదిగొండ మండలంలోని పలు గ్రామాల వద్ద చూడముచ్చటగా ఉన్నాయి.